ప్రజాశక్తి
శనివారం 22 ఏప్రిల్ 2023
5
శ్రీకాకుళం

'ఉపాధి' ఉక్కిరిబిక్కిరి

- మండుటెండలోనే పనులు చేస్తున్న కూలీలు
- సేద తీరేందుకు నీడ కరువు
- టార్పాలిన్లు లేక ఇబ్బందులు
- మంచినీళ్లకూ దిక్కులేని వైనం

పేదల ఊటీగా పేరొందిన సిక్కోలు భానుడి భగభగలతో నిప్పుల కొలిమిగా మారుతోంది. ఉదయం ఎనిమిది గంటలకే సూర్యుడు భగ్గుమంటున్నాడు. మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత జనం ఇళ్లకే పరిమితవుతున్నారు. ఇక ఉపాధి కూలీల పరిస్థితి వేరే చెప్పనక్కర్లేదు. మండుటెండల్లోనే పనిచేస్తూ చెమటలు కక్కుతున్నారు. ఎండ వేడిమి, తీవ్ర ఉక్కపోతతో కూలీలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మేలో నమోదయ్యే గరిష్ట ఉష్ణోగ్రతలు ఏప్రిల్‌లోనే మొదలు కావడంతో కూలీలు బెంబేలెత్తుతున్నారు. ఉపాధి చట్టంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులతో కూలీలు సాకర్యాలకు దూరమయ్యారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ప్రకారం పని ప్రదేశంలో కల్పించాల్సిన సాకర్యాలు కల్పించకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, పలాస

పలాస మండలం సున్నాడలో పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

జిల్లాలో 4.32 లక్షల మందికి జాబ్‌కార్డులు జారీ చేయగా వాటిలో 3.78 లక్షల కార్డులు మనుగడలో ఉన్నాయి. మొత్తం 7.49 లక్షల మంది కూలీలకు గానూ ఏడాదిలో 6.08 లక్షల మంది చురుగ్గా పనులకు వస్తున్నారు. ప్రస్తుతం చేపడుతున్న ఉపాధి హామీ పనులకు రెండు లక్షల మందికి పైగా హాజరవుతున్నారు. పని చేపడుతున్న ప్రాంతాల్లో ఎక్కడా టార్పాలిన్లు కనిపించడం లేదు. వేసవిలో పని ప్రదేశాల్లో తగిన సదుపాయాల్లేక కూలీలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో అల్లాడిపోతున్నారు. 40 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో చెమటలు కక్కుతున్నారు. ఎండలు మండుతుండడంతో ఉపాధి పనుల వేళల్లో మార్పులు చేశారు. ఉదయం ఏడు గంటల నుంచి పది వరకు, సాయంత్రం నాలుగు నుంచి 6.30 గంటల వరకు పని చేయిస్తున్నారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం పని ప్రదేశంలో కల్పించాల్సిన సౌకర్యాలను కల్పించడం లేదు. ఒకటీ అరా చోట్ల మినహా నీడ కల్పించే టార్పాలిన్లు లేవు. నీడ కోసం కూలీలే సొంతంగా పందిళ్లు వేసుకుంటున్న పరిస్థితి నెలకొంది. మరోవైపు తీవ్రమైన ఎండల్లో రెండు పూటలా పని చేయాల్సిందేనని కూలీలపై అధికారులు ఒత్తిడి చేస్తున్నారు.

కూలీల సౌకర్యాలకు కేంద్రం కోత

ఉపాధి కూలీలకు అదనంగా చెల్లించే వేసవి భృతిని రెండేళ్లుగా ఆపేశారు. 2020-21 వరకు ఉపాధి హామీ పనులకు రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా టిసిఎస్ (టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్) టెక్నాలజీని వినియోగించేది. దేశవ్యాప్తంగా ఒకటే విధానం ఉండాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో 2021-22 ఉంచి ఎపిని కూడా ఎన్ఐసి (నేషనల్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) పరిధిలోకి తీసుకొచ్చింది. దీంతో కూలీలకు అప్పటివరకు అందుతున్న సౌకర్యాలన్నీ ఆగిపోయాయి. వీటిలో వేసవిభత్యం ప్రధానమైనది. ఫిబ్రవరిలో అదనంగా 20 శాతం, మార్చిలో 25శాతం, ఏప్రిల్, మేలో 30 శాతం, జూన్‌లో 20 శాతం చొప్పున చెల్లించేవారు.

ఎండలతో భూమి గట్టి పడడం, వేసవిలో పెరిగే ఉష్ణోగ్రతల్లో పనిచేయడం కష్టంగా ఉంటుందని వేసవి భత్యం కింద అదనంగా చెల్లించేవారు. వేసవిలో పనికి హాజరయ్యే కూలీలకు గతంలో మజ్జిగ కోసం రోజుకు రూ.5 చొప్పున అదనంగా చెల్లించేవారు. రెండేళ్లుగా దాన్నీ నిలిపేశారు. సాధారణ రోజుల్లో తాగునీటి కోసం రూ.5 చొప్పున చెల్లించే విధానం కూడా ప్రస్తుతం అమల్లో లేదు. పని ప్రదేశాల్లో కూలీలకు గతంలో నీడ కల్పించేందుకు టార్పాలిన్లు ఏర్పాటు చేసేవారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు కూలీలు టార్పాలిన్ల కిందకు వెళ్లి సేదతీరేవారు.

కూలీలకు ఇబ్బంది లేకుండా చర్యలు

కూలీల కోసం గతంలోనే టార్పాలిన్లను పంపిణీ చేశాం. కొన్నిచోట్ల మాత్రమే వినియోగిస్తున్నారు. పని ప్రదేశాల్లో టార్పాలిన్లను వినియోగించేలా చూడాలని సిబ్బందిని ఆదేశించాం. ఎండలు ఎక్కువగా ఉన్నందున కూలీలు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. అవసరమైన వారికి ఒఆర్ఎస్ ప్యాకెట్లను అందిస్తున్నాం. తాగునీటిని అందించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించాం. పనిలోకి వేగంగా వచ్చి, తొందరగా వెళ్లాలని చెప్తున్నాం.

- జి.వి చిట్టిరాజు, డ్వామా పీడీ

ఎండకు తట్టుకోలేకపోతున్నాం

ఇంట్లో ఉంటే పూట ఎలా గడుస్తుందని పనుల్లోకి వస్తున్నాం. ఎండలు మండిపోవడంతో పనులు చేయలేకపోతున్నాం. టార్పాలిన్లు లేకపోవడంతో ఎక్కడా నిలువ నీడ లేదు. సొంతంగా కమ్మలతో పందిళ్లు వేసుకుని సేదతీరుతున్నాం.

- కె.లక్ష్మి, సున్నాడ, పలాస

నీళ్లు మేమే తెచ్చుకుంటున్నాం

ప్రభుత్వం గతంలో మంచినీటికి డబ్బులు ఇచ్చేది. వేసవిలో మజ్జిగ కూడా ఇచ్చేవారు. ఇప్పుడు ఏవీ ఇవ్వడం లేదు. ఇళ్ల నుంచే సీసాలతో నీళ్లు తెచ్చుకుంటున్నాం. మెడికల్ కిట్లు కూడా లేవు.

- కె.దుర్యోధన, సున్నాడ, పలాస

ఎన్నికల మీద శ్రద్ధ విద్యార్థులపై లేదు

విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్

ప్రజాశక్తి - కొత్తూరు

ప్రశ్నలకు సమాధానాలు చెప్తున్న విద్యార్థిని సింధు

ఎన్నికల మీద ఉన్న శ్రద్ధ విద్యార్థులపై ఉండడం లేదని విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఉపాధ్యాయులపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. మండలంలో వనపలోని కెజిబివి పాఠశాలలో, కడుమలోని జెడ్‌పి ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి సామర్థ్యాన్ని ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. కెజిబివి విద్యార్థులకు ఇంగ్లీష్, లెక్కలు, సోషల్ సబ్జెక్టులపై ప్రశ్నలు వేశారు. విద్యార్థులు సరిగా సమాధానాలు చెప్పడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. కెజిబివి మెనూ ఛార్టును, వంటలను పరిశీలించి మెనూ ఛార్టు ప్రకారం ఇస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అక్కడ నుంచి కడుమ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదివే విద్యార్థిని సింధు ఇంటికి వెళ్లి కొన్ని లెక్కలు ఇచ్చారు. లెక్కలు చేయడంతో విద్యార్థినిని అభినందించారు. నాలుగో తరగతి విద్యార్థి హర్షవర్ధన్, మరో విద్యార్థినికి సోషల్, ఇంగ్లీష్ సబ్జెక్టులకు సంబంధించి ప్రశ్నలు వేయగా వారు సరిగా సమాధానాలు చెప్పకపోవడంతో పాఠశాల హెచ్‌ఎం దుర్గాప్రసాద్, ఎంఇఒ బి.శ్రీధర్‌పై అసహనం వ్యక్తం చేశారు. ప్రయివేటు పాఠశాలల విద్యార్థులకు సమానంగా ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుంటే ఉపాధ్యాయులు ఆ స్థాయిలో ఎందుకు బోధించడం లేదని ప్రశ్నించారు. ఎన్నికలు, సంఘాల కార్యకలాపాలపై ఉన్న శ్రద్ధ విద్యార్థులపై చూపితే బాగుంటుందన్నారు. పర్యవేక్షణా లోపంపై ఎంఇఒ, హెచ్‌ఎంపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆర్‌జెడి జ్యోతికుమారి, డిఇఒ తిరుమల చైతన్యను ఆదేశించారు. కొత్తూరు, ఎల్ఎన్‌పేట, మెళియాపుట్టి, చాపరలో బాలికల వసతిగృహాల నిర్మాణం రెండేళ్ల కిందటే పూర్తయినా నేటికీ వినియోగంలోకి తీసుకురాలేదని వైసిపి నాయకులు లోతుగెడ్డ తులసీ వరప్రసాద్ ప్రిన్సిపల్ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. గిరిజన గ్రామమైన అబలసింగిలో పాఠశాల భవనం లేక 22 మంది విద్యార్థులు ఆరుబయటే చదువుతున్నారని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ప్రిన్సిపల్ కార్యదర్శి వెంట తహశీల్దార్ పి.బాల, ఎంపిడిఒ ఎం.పావని, ప్రత్యేక అధికారి బి.రూప, జిసిడిఒ నీరజ, సర్పంచ్ వి.ఆఫీసురావు తదితరులున్నారు.

సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న స్పీకర్ సీతారాం

మౌలిక వసతుల కల్పనకు కృషి

ప్రజాశక్తి - ఆమదాలవలస

నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి మౌలిక వసతుల కల్పనకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని కొరపాం సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నదీ, లేనిదీ లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన నాలుగేళ్లుగా దేశానికే రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి జగన్ పరిపాలిస్తున్నారని చెప్పారు. కుల, మత, ప్రాంతీయ విభేదాలకు తావులేకుండా అవినీతి రహిత పారదర్శక పాలన అందిస్తున్నారని కొనియాడారు. గడప గడపకు ప్రజా సంక్షేమం కొనసాగుతోందన్నారు.

గత ప్రభుత్వంలా మాటల ప్రభుత్వం కాదని, జగన్‌ది చేతల ప్రభుత్వమన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతోందని చెప్పారు. గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ దేశానికే తలమానికంగా నిలిచిందన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం నవరత్నాల పథకాలను అమలు చేస్తూ ఆదర్శవంతమైన పాలన అందిస్తున్న ఘనత జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్‌పిటిసి సభ్యులు బెండి గోవిందరావు, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, ఎంపిడిఒ వాసుదేవరావు, మండల వ్యవసాయాధికారి మెట్ట మోహనరావు, వైసిపి నాయకులు గురుగుబెల్లి నీలారావు, నక్క కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో చిన్నారి మృతి

ప్రజాశక్తి - జి.సిగడాం

సాద్వీక (ఫైల్ ఫొటో)

ఆడుతూ తిరిగే చిన్నారిపై వీధి కుక్కలు విరుచుకుపడ్డాయి. కొంత దూరం ఈడ్చుకెళ్లి మరీ దాడి చేశాయి. తీవ్ర గాయాలపాలైన చిన్నారి సాద్వీక (1) ఆస్పత్రిలో శుక్రవారం మృతి చెందింది. మండలంలోని మెట్టవలసకు చెందిన పైల రాంబాబు, మహాలక్ష్మి టిఫిన్ దుకాణం నడుపుకుంటూ, వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మహాలక్ష్మి ఇద్దరు కుమార్తెలు కుసుమ, చిన్నారి సాద్వీకను తీసుకుని శుక్రవారం సాయంత్రం టిఫిన్ దుకాణం వద్దకు వెళ్లింది. దుకాణానికి కొద్ది దూరంగా పిల్లలిద్దరూ ఆడుకుంటుండగా కుక్కలు ఒక్కసారిగా గుంపుగా వచ్చి చిన్నారి సాద్వీకపై దాడి చేశాయి. చిన్నారిని సమీపంలోని టేకు తోటకు ఈడ్చుకెళ్లాయి. చెల్లిపై కుక్కలు దాడి చేయడాన్ని చూసిన కుసుమ కేకలు వేయడంతో మహాలక్ష్మితో పాటు అక్కడ ఉన్న స్థానికులు వచ్చారు. కుక్కలను వెంటబెట్టి తీవ్ర గాయాలపాలైన చిన్నారిని విజయనగరం జిల్లా రాజాం సామాజిక అసుపత్రికి తరలించారు. చిన్నారిని బతికించేందుకు వైద్యులు శాయశక్తులా ప్రయత్నించినా, పరిస్థితి విషమించడంతో చిన్నారి మృతి చెందింది. గారాలపట్టి కళ్లెదుటే మృతి చెందడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు.

గిట్టుబాటు ఉన్న ఉత్పత్తులకు ప్రాధాన్యం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

సమావేశంలో మాట్లాడుతున్న జెసి నవీన్

మార్కెట్‌లో మంచి గిట్టుబాటు ధర వచ్చే ఉత్పత్తులకు ప్రాధాన్యమిచ్చేలా విత్తనాలు సరఫరా చేయాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్‌లో రైతులు సాగు చేసే పంటలపై అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో తరుచూ సంచార పశు వైద్య వాహనాలు తిరిగేలా చూడాలని, సంచార వైద్య సేవలను రైతులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాన్నారు. పశుసంవర్థకశాఖ ద్వారా చేపడుతున్న కార్యక్రమాల అమలు తీరుపై ఆ శాఖ జెడి ఎం.కిషోర్‌ను అడిగి తెలుసుకున్నారు. చేయూత, పిఎంకెసికి సంబంధించి ముందస్తు కార్యాచరణ రూపొందించామని జెడి తెలిపారు. డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు మాట్లాడుతూ కొనుగోలుకు మంచి గిరాకీ ఉన్న రకాలు పండించేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. వ్యవసాయ సలహా మండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు దిగువ స్థాయి వరకు తెలియజేయడం ద్వారా సరైన ఫలితాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. వ్యవసాయ సలహా మండలి బోర్డు చైర్మన్ నేతాజీ మాట్లాడుతూ ఎగుమతి ఆధారిత రకాలకు అవకాశం కల్పించాలన్నారు. ఆయిల్‌పామ్ పంటకు మంచి డిమాండ్ ఉన్న నేపథ్యంలో రైతులను అటువైపు మళ్లించాలని సూచించారు. గ్రామ, మండల స్థాయిలో వ్యవసాయ సలహా మండలి సమావేశాలు నిర్వహించి, వాటి నివేదికలు జిల్లాస్థాయి సమావేశంలో చేర్చించేలా చర్యలు చేపట్టాలన్నారు. గుర్రపుడెక్క, షట్టర్ల సమస్యలతో సాగునీటి సమస్యలు తలెత్తాయని, అవి పునరావృతం కాకుండా చూడాలని పలువురు సభ్యులు కోరారు. వ్యవసాయ శాఖ జెడి కె.శ్రీధర్ మాట్లాడుతూ రైతుభరోసా కేంద్రాల ద్వారా ఎరువులు అందించేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంలో నవధాన్యాల సాగు పోస్టర్, స్వార్వత్రిక సూత్రాల కరపత్రాలను జెసి ఆవిష్కరించారు. అనంతరం భూసారం పెంచే విత్తనాల కిట్లను రైతులకు అందించారు. సమావేశంలో పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.జయంతి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

నిజాయితీకి బదిలీ బహుమానమా?

- డిఇఒ పగడాలమ్మ బదిలీ అన్యాయం
- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మాట్లాడుతున్న గోవిందరావు

నిబద్ధతతో, పారదర్శకంగా విధులు నిర్వహించడమే కాకుండా డిఎస్‌సి - 98 నియామకాల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనిచేసిన జిల్లా విద్యాశాఖ అధికారి జి.పగడాలమ్మను బదిలీ అన్యాయమని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి అన్నారు. నగరంలోని సుందరయ్య భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నిబంధనలకు వ్యతిరేకంగా అధికార పార్టీ ముఖ్య నేతలు చేసిన ప్రతిపాదనలను పగడాలమ్మ తిరస్కరించడంతో టెక్కలి డిప్యూటీ డిఇఒగా రివర్షన్ ఇచ్చారని తెలిపారు. కక్షసాధింపు విధానంలో ఆమెను బదిలీ చేయించడాన్ని తప్పుపట్టారు. నిజాయితీతో, నిబంధనల ప్రకారం నడుచుకుంటున్న అధికారులను ప్రోత్సహించాల్సింది పోయి బదిలీని బహుమానంగా ఇస్తారా అని ప్రశ్నించారు. హోదాను కోల్పోతానని తెలిసినా, అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిబంధనల ప్రకారం ముందుకెళ్లిన పగడాలమ్మను అభినందించారు. నిబద్ధతతో, నిజాయితీతో పనిచేసే ఇటువంటి అధికారులకు ప్రజలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. గతంలోనూ జిల్లా అధికారులను ఇలాంటి పద్ధతుల్లో వేధించిన సంఘటనలు ఉన్నాయని తెలిపారు. ఇటువంటి వాటిని ప్రజలే ఖండించాలన్నారు.

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే

ప్రజాశక్తి - శ్రీకాకుళం

నగరంలోని మూడు క్లస్టర్లలో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేను శుక్రవారం చేపట్టారు. వైద్యాధికారి దీపిక ఆధ్వర్యాన మూడు రోజుల పాటు సర్వే చేయనున్నారు. సిగ్మాకన్సరేటిన్స్ రీ సర్వే ఏజెన్సీ ద్వారా నిర్వహిస్తున్న సర్వే తీరును జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి బొడ్డేపల్లి మీనాక్షి పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి విక్టర్‌బాబు, జిల్లా కోఆర్డినేటర్ శ్రీరామ్ భాస్కరరావు, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలు

ప్రజాశక్తి - పలాస

రైల్వే ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని ఈస్ట్‌కోస్ట్ రైల్వే చీఫ్ మెడికల్ అధికారి డి.రామారావు అన్నారు. పలాస రైల్వే ఆస్పత్రిని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. రైల్వే శ్రామిక్ యూనియన్ నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. పలు సమస్యలపై యూనియన్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సెంట్రల్ ఆఫీస్ బేరర్ ఎం.రామకృష్ణ, పలాస బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు పి.వి.ఎన్ రావు, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సర్వెంట్ల పాత్ర కీలకం

విశ్రాంత ఐఎఎస్ అధికారి అప్పారావును సత్కరిస్తున్న అధికారులు

శ్రీకాకుళం : పరిపాలనా యంత్రాంగానికి ప్రధాన ఆయువుపట్టు సివిల్ సర్వెంట్లు అని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. 16వ జాతీయ పౌర సేవల దినోత్సవ వేడుకలను కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సివిల్ సర్వీస్ అనేది దేశ ప్రజా పరిపాలనకు బాధ్యత వహించే సేవలు అని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు అందించినప్పుడు వారిలో కలిగే సంతోషం సంతృప్తిని కలిగిస్తుందన్నారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ శ్రీకాకుళంలో ట్రైనీ జాయింట్ కలెక్టర్‌గా చేరిన తనకు కోవిడ్ మొదటి దశలో ఆ బాధ్యతలు అప్పగించారని గుర్తుచేసుకున్నారు. కోవిడ్ సమయంలో నిర్వహించిన విధులు సంతృప్తినిచ్చిందన్నారు. జిల్లా ఇన్‌ఛార్జి ఎస్‌పి మణికంఠ సివిల్ సర్వీస్ సాధించడానికి చేసిన ప్రయత్నాలు వివరించారు. అనంతరం కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు.

1997 బ్యాచ్ విశ్రాంత ఐఎఎస్ అధికారి ఆర్.అప్పారావు, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌ను అధికారులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా అటవీశాఖ అధికారి నిషాకుమారి, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, ఆర్‌డిఒ బొడ్డేపల్లి శాంతి, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్లు తెరిచే వరకు అన్నదానం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

అన్నదానం చేస్తున్న గొండు శంకర్

పేదల ఆకలి తీర్చేందుకు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్లను జగన్ ప్రభుత్వం కక్షసాధింపుతో నిలిపివేసిందని సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు, టిడిపి శ్రీకాకుళం నియోజకవర్గ నాయకులు గొండు శంకర్ విమర్శించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా తిరిగి క్యాంటీన్లను తెరిచే వరకు నియోజకవర్గంలో అన్నదానాన్ని కొనసాగిస్తానని స్పష్టం చేశారు. చంద్రబాబు నాయుడు పుట్టినరోజును పురస్కరించుకుని చేపట్టిన అన్నదానానికి విశేష స్పందన లభించిందన్నారు. అందుకే నగరంలోని ఏడు రోడ్ల కూడలిలో అన్నదాన ప్రక్రియను కొనసాగిస్తామన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేశారని, కక్షసాధింపు రాజకీయాలతో పాలన సాగిస్తున్నారని విమర్శించారు. ప్రజల వద్దకు వెళ్తున్న వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులను ప్రజలు ఎక్కడికక్కడ నిలదీస్తున్నారని చెప్పారు. వైసిపి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం గెలుపు ఖాయమన్నారు. శ్రీకాకుళం నియోజకవర్గంలో పలు సమస్యలను గుర్తించామని, వాటి పరిష్కారానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. స్థానిక ఏడు రోడ్ల కూడలి వద్ద నిర్వహించిన అన్నదాన శిబిరానికి రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు, టిడిపి నాయకులు గొండు వెంకటరమణమూర్తి, అంబటి లక్ష్మీరాజ్యం, బి.నాగేంద్ర యాదవ్, డి.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM
I.P. 4/2023

Between: **Vankala Shanti Swarup.** - Petitioner.
And: **Kella Janardhana Rao and 24 others** -Respondents.

To,
Respondents:
1. Kella Janardhana Rao, S/o late Narapu Naidu, aged about 55 years, Hindu, resident of Kovilam Village, L.N.Peta Mandal, Srikakulam District.
2. Sistu Chandru Naidu, S/o late Varahala Naidu, aged about 46 years, Hindu, resident of Rotary Nagar, L.N.Peta Junction, L.N.Peta Mandal, Srikakulam District.
3. Kagana Venakata Ramana, S/o late Ampoji, aged about 45 years, Hindu, resident of Peddakota Village, L.N.Peta Mandal, Srikakulam District.
4. Ippili Seetharam, S/o late Appayya, aged about 50 years, Hindu, resident of L.N.Peta Village and Mandal, Srikakulam District.
5. Dasari Ramulu, S/o late Appanna, aged about 70 years, Hindu, resident of L.N.Peta Village and Mandal, Srikakulam District.
6. Palavalasa Simhadri, S/o late Ramulu, aged about 48 years, Hindu, resident of L.N.Peta Village and Mandal, Srikakulam District.
7. Ippili Gopi, S/o Ramanayya, aged about 47 years, Hindu. resident of L.N.Peta Village ard Mandal, Srikakulam District.
8. Vana Ramesh, S/o Paramesu, aged about 40 years, Hindu, Miriappalli Village, L.N.Peta Mandal, Srikakulam District.
9. Kuppili Ramulamma, W/o late Mokhalingam, aged about 70 years, Hindu, resident of L.N.Peta Village and Mandal, Srikakulam District.
10. Kasimikota Chinnavadu, S/o Ramayya, aged about 62 years. Hindu, resident of Peddakota Village, L.N.Peta Mandal, Srikakulam District.
11. Thottadi Appanna, S/o Raminaidu, aged about 50 years, Hindu, Kovilam Colony, L.N.Peta Mandal, Srikakulam District.
12. Veerarapu Venkata Rao, S/o late Lakshmana Rao. aged about 47 years, Hindu, L.N.Peta Junction, Kummari Veedhi, L.N.Peta Mandal Srikakulam District.
13. Mugada Apparao, S/o late Ramayya, aged about 65 years, Hindu, resident of Kovilam Village, L.N.Peta Mandal, Srikakulam District.
14. Kella Govinda Rao, S/o Annam Naidu, aged about 52 years, Hindu, resident of Kovilam Village, L.N.Peta Mandal, Srikakulam District.
15. Podilapu Venkata Ramana, S/o Mokhalingam, aged about 58 years, Hindu, resident of Ravichendri Village, L.N.Peta Mandal. Srikakulam District.
16. Palli Jagannadha Rao, S/o late Lakshmi Narayana, aged about 68 years, Hindu, resident of R.R.Colony, Garlapadu, L.N.Peta Mandal,Srikakulam District.
17. Gavara Govinda Rao, S/o Chinnodu, aged about 50 years, Hindu, resident of R.R.Colony, Garlapadu, L.N.Peta Mandal, Srikakulam District.
18. Gavara Chinnodu, S/o Mokhalingam, aged about 70 years, Hindu, resident of R.R.Colony, Garlapadu, L.N.Peta Mandal, Srikakulam District.
19. Sanapala Sankara Rao, S/o Janardhana Rao, aged about 39 years, Hindu, resident of Dhanukota Village, L.N.Peta Mandal, Srikakulam District.
20. Bevara Ramana Murthy, S/o Appala Naidu, aged about 45 years. Hindu, resident of Rottavalasa Village, Sarubujjili Mandal, Srikakulam District.
21. Suresh Mishro, Father's name not known to the petitioner, aged about 42 years, Hindu, resident of Korasavada Village, Pathapatnam Mandal, Srikakulam District.
22. Pilli Narayana Rao, S/o Father's name not known to the petitioner, aged about 60 years, Hindu, resident of Foxdarpeta Village, L.N.Peta Mandal, Srikakulam District.
23. Nadipilli Govinda Rao, S/o Appala Naidu, aged about 50 years, Hindu, resident of Kovilam Village, L.N.Peta Mandal, Srikakulam District.
24. Mandadi Prasada Rao, S/o Ramanayya, aged about 40 years, Hindu, resident of L.N.Peta Village and Mandal, Srikakulam District.
25. H.V.Naidu, S/o Rama Rao, aged about 42 years, Hindu, residing opposite ZP, Srikakulam Town and District.

Take notice that the above insolvency petition filed by the above named petitioner is stand posted for hearing at **10.30 AM., on 03-05-2023** before the Honourable principal Senior Civil Judge Court Srikakulam and if you wasn't to contest the matter you may do so either in person or by a duly instructed pleader and if you fail to show cause matter will be decided in your absence and expert.

// By court order //

G.S. KRISHNA PRASAD
Advocate, Srikakulam
Cell: 7893450188

IN THE HONOURABLE COURT OF THE M.A.C.T.-CUM-IVth ADDITIONAL DISTRICT JUDGE FOR SC AND ST COURT AT VIZIANAGARAM
M.O.P. 20 /2022

Between;
Smt. Korukonda Laxmi ......Petitioner
And:
Gedela Nageswara Rao and Others .....Respondents

4th Respondent:
Sambana Prasad Rao S/o late Papa Rao, Hindu, aged about 55 years, resident of Tekkali village and mandal,Srikakulam District., the Driver of the lorry bearing No.A.P.16 TJ 6317.

Please take notice that the above named petitioner filed the above M.V.O.P 20/2022 against you and others for claiming compensation on account of injuries sustained by him in a motor vehicle accident and the matter coming for your appearance and stands posted to **18-05-2023,** on that day your personally or through your Advocate attend before the Honorable Court at **10-30 A.M.**, failing which the Honorable Court will be heard and determined in your absence exparte as per Law.

P.S.R.MURTHY
Advocate
Vizianagaram
Andhra Pradesh
94403 45113

Place:Vizianagaram
Dt. 20-04-2023

IN THE HONOURABLE COURT OF THE M-A-C-T-CUM- 3rd ADDITIONAL DISTRICT JUDGE AT SRIKAKULAM (A.P).
I.A.437/2022 IN M.V.O.P. 110/2022.

Between: **Sasubelli Thavitinaidu.** -Petitioner-Petitioner.
And:
1 Latchubothu Durgarao and 2 others. -Respondents-Respondents.
2 Kundrapuu Srinu. -Proposed respondent.
To,
Kundrapuu Srinu, S/o Appala Naidu, Owner of the APSRTC Bus bearing No: AP 30 Y 4499, resident of Venkateswara Colony, J.R.Puram, Ranasthalam Mandalam, Srikakulam District.

NOTICE
Please take this notice in the above matter that the above matter is posted **22-05-2023** for your appearance. You are here by directed to appear before the above court at **10-30 A.M. on 22-05-2023** in person or thorough advocate with out fail. Otherwise the matter will be decided in your absence.

By court order.

CHIGURUPALLI RAMA MOHAN,
Advocate,
Srikakulam ,
Cell: 9440116221.

మాట్లాడుతున్న పోలినాయుడు

జలవనరుల సంరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి- శ్రీకాకుళం

వర్షపు నీటిని ఆదా చేయడం, భూగర్భ జలాలను పెంచడానికి కేంద్ర ప్రభుత్వం జాతీయ జలశక్తి మిషన్ ఏర్పాటు చేశారని ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ డాక్టర్ ఆర్.ప్రమీల తెలిపారు. దానిలో భాగంగా నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (బాలురు)లో విద్యార్థులకు అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జలశక్తి అభియాన్ అనే పథకంలో అనేక స్కీమ్‌లు ఉన్నాయని, వాటిని ప్రజలు మరింతగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కమిటీ సభ్యులుగా డాక్టర్ వై.పోలినాయుడు, సిహెచ్.రామమూర్తి, రవిబాబు, అరుణకుమారి, పావని నియమించామని తెలిపారు. పోలినాయుడు, రామ్మూర్తి మాట్లాడుతూ వర్షపు నీటిని ఒడిసిపట్టుకోవాలన్నారు. భూగర్భ జలాలను పెంచేందుకు కళాశాల ప్రాంగణంలో కొన్ని ఇంకుడు గోతులను ఏర్పాటు చేయాలని నిర్ణయంచామన్నారు. ఐక్యూఏసి కో-ఆర్డినేటర్ డాక్టర్ శాంతీదేవి మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు కళాశాలలో చేపట్టడం వల్ల అనేక సామాజిక కార్యక్రమాలపై విద్యార్థులకు అవగాహన కలుగుతుందన్నారు. నీటి వినియోగం, పొదుపుపై సరైన అవగాహనా దృక్పథం కలిగి ఉండాలన్నారు. భావితరాలకు నీటి అవసరాలు మరింత ఎక్కువగా అవసరం ఉంటుందని, ఆ దిశగా అందరూ కృషి చేయాలని అన్నారు. భౌతిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జైపాల్‌రావ్ మాట్లాడుతూ నీటి గుంటలను తవ్వుతూ, వర్షం నీటిని పొదుపు చేయడం వల్ల మన ఇంటి పరిసర ప్రాంతాల్లో బోరుబావులకు నీరు అందుతుందని అన్నారు. వృక్షశాస్త్ర విభాగధిపతి డాక్టర్ రామారావు, గణిత శాస్త్ర విభాగపతి రవిశంకర్ మాట్లాడుతూ మానవ శరీరంలో 80 శాతం నీరే ఉంటుందని, జల ఆధారంతోటే మానవులు గానిచ ప్రాణులు గాని మనుగడ సాగిస్తాయని అన్నారు. స్వచ్ఛమైన నీరు వాడకపోవడంతో అనేక రుగ్మతలకు కారణమవుతున్నాయని అన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

గడప గడపకూ సంక్షేమం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ఈ నాలుగేళ్లలో సిఎం జగన్మోహన్‌రెడ్డి పాలనలో గడపగడపకు సంక్షేమం.. ఇంటింటా ఆనందం అన్నట్లుగా సాగుతుందని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కిష్టుపురంలో సర్పంచ్ బొడ్డు వెంకటరమణ అధ్యక్షతన శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ముందుగా మహిళలతో కలిసి సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అధికారులు, సచివాలయ ఉద్యోగులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలతో ముద్రించి పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి, మండల సచివాలయ కన్వీనర్ల ఇన్‌ఛార్జి గడ్డవలస నాగభూషణరావు, మండల పార్టీ అధ్యక్షుడు నూక సత్యరాజు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు దుక్క రోజా పాల్గొన్నారు.

బిజెపి ప్రభుత్వాన్ని సాగనంపాలి

శ్రీకాకుళం : ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్రజా సమస్యలు పరిష్కారానికి పోరాటాలే శరణ్యమని, బిజెపి ప్రభుత్వాన్ని ఉద్యమాల ద్వారానే ప్రజలు గద్దె దించాలని వామపక్ష నాయకులు పిలుపునిచ్చారు. దేశ వ్యాప్త ప్రచార భేరిలో భాగంగా 8వరోజు నగరంలో పెద్దరెల్లివీధి, మందలవీధి, రాయ్‌నగర్ కాలనీల్లో ఇంటింటికీ పోస్టర్లను అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం కార్యదర్శివర్గ జిల్లా సభ్యులు బి.కృష్ణమూర్తి, సిపిఎం, సిపిఐ నగర కార్యదర్శులు టి.తిరుపతిరావు, డోల శంకరావు మాట్లాడారు. భారతదేశ రాజ్యాంగానికి తూట్లు పొడిచే విధంగా ప్రధాని మోడీ ప్రభుత్వం తయారైందని ఆందోళన వ్యక్తం చేశారు. దళితుల కోసం కేటాయించిన చట్టాలన్నీ తుంగలో తొక్కుతున్నారని విమర్శించారు. పారిశుధ్య కార్మికుల జీవితాలు పెనం మీద నుంచి పొయ్యిలోకి పడిన చందంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులకు, గిరిజనులకు కేటాయించిన నిధులను మళ్లించి, కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. ఇలాగే కొనసాగితే దళితులను, ఆదివాసీలను సమీకరించి పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు సిహెచ్.గోవిందరావు, వెంకటరావు పాణిగ్రహి, ఎ.సత్యనారాయణ, ఎస్.శ్రీనివాసులు, పి.ప్రభావతి, శ్రీదేవిపాణిగ్రహి, బి.సింహాచలం, పుణ్యవతి, లక్ష్మి, రాములమ్మ, కాంచన, శ్రీను పాల్గొన్నారు.

రణస్థలం: దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతున్న కేంద్ర బిజెపి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని సిపిఎం పార్టీ నాయకులు సిహెచ్.అమ్మన్నాయుడు పిలుపునిచ్చారు. కేంద్ర బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన మండలంలోని నెలివాడలో ప్రచార భేరి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాని మోడీ నాయకత్వంలోని మనందరి ఉమ్మడి సంపదగా ఉన్న బ్యాంకులను, మనం కట్టిన పన్నులతో నిర్మించిన ప్రభుత్వ రంగ పరిశ్రమలను, వాడరేవుల్ని, ఆఖరికి మన అందరికీ అన్నం పెట్టే వ్యవసాయాన్ని సైతం కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తుందని విమర్శించారు. గ్రామీణ పేదలకు ప్రాణధారంగా ఉన్న ఉపాధిహామీ పథకాన్ని మోడీ ప్రభుత్వం

రణస్థలం : ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

నిరుగారుస్తుందని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీ నిధులు పెంచాల్సిందిపోయి భారీగా కేటాయింపులు తగ్గించేశారని, గతం కంటే రూ.40 వేల కోట్లు నిధులు కోత విధించారని తెలిపారు. ఉపాధి హామీ చట్టాన్ని బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. భావనపాడు పోర్టును అదానికి అప్పగించడానికి జగన్ పూనుకుంటున్నాడని అన్నారు.

పొందూరు: పొందూరులో ప్రచార భేరీ కార్యక్రమంలో భాగంగా సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన 'బిజెపిని ఓడించాలి... దేశాన్ని కాపాడాలి' అంటూ ఇంటింటా పోస్టర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లాకార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి, మధ్యాహ్న భోజన పథకం నాయకులు రాంబల్లి సత్యనారాయణ, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి అనపాన షణ్ముఖరావు, పి.ప్రసాద్ పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇచ్చే వారిగా ఎదగాలి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మేనేజ్‌మెంట్ కోర్సు చదువుతున్న ప్రతి విద్యార్థీ ఒకరి వద్ద ఉద్యోగం చేసే వాడుగా కాకుండా పది మందిరి ఉద్యోగాలు కల్పించే వాడిగా జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలని అంతర్ ఐటి సిఈఓ రజనీస్ వసంత హితవుపలికారు. టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల ఎంబిఎ విభాగం ఆధ్వర్యాన శుక్రవారం నిర్వహించిన 'చతుర-23' పోటీల ముగింపు సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థి దశలో అనుభవం కోసం చిన్నచిన్న వ్యాపారాలు చేయాలన్నారు. పలు కంపెనీలు నిర్వహించే ధ్రువపత్రాల కోర్సుల్లో పాలు పంచుకోవాలన్నారు. ఇంటర్న్‌షిప్ విధిగా చేయాలని,

మాట్లాడుతున్న రజనీస్ వసంత

కంపెనీకి నాయకత్వం వహించగల సామర్థ్యం కలిగి ఉండాలని అన్నారు. చైర్మన్ డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావులు మాట్లాడుతూ మార్కెట్ స్కిల్స్‌ను నేర్చుకోవడంతో పాటు నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీసేందుకు దోహదపడే మరిన్ని సదస్సులు ముమ్మందు నిర్వహిస్తామన్నారు. చతురలో భాగంగా బిబిఎం, ఎంబిఎ విద్యార్థులకు మార్కెట్ మంత్రా, స్మార్ట్ ఇన్వెస్టర్, జగ్మిట్ పోటీలు, బిఎ, బికాం, బిఎస్‌సి విద్యార్థులకు క్విజ్, డిబేట్, ఇన్నోవేటర్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు.

అందులో గెలుపొందిన పద్మావతి డిగ్రీ కళాశాల, గాయత్రి డిగ్రీ కళాశాల, అంబేద్కర్ యూనివర్సిటీ విద్యార్థులకు జ్ఞాపికలను, ధ్రువపత్రాలను అందజేశారు. ఒడిశా, ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి 200 మంది వరకు విద్యార్థులు పలు పోటీల్లో పాల్గొన్నారని కన్వీనర్ హెచ్‌డి డాక్టర్ బి.శివకుమార్ వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ డాక్టర్ డి.విష్ణుమూర్తి, డీన్ డాక్టర్ డి.విజయ్కుమార్, సివిల్ హెచ్‌ఒడి డాక్టర్ పి.దినకర్, కో-కన్వీనర్ డాక్టర్ చింతామని ప్రసాద్‌పట్నాయిక్, డాక్టర్ కె.వేణు గోపాల్, డాక్టర్ బి.బలరాం, డి.ప్రణయ, వి.గోపాలకృష్ణ, విద్యార్థి కన్వీనర్లు కె.దివ్య పాల్గొన్నారు.

పలాసలో సెల్ఫీ ఛాలెంజ్‌లు

మంత్రి సీదిరికి గౌతు శిరీష కౌంటర్

ప్రజాశక్తి- పలాస

పలాస నియోజకవర్గంలో సెల్ఫీ ఛాలెంజ్‌లు మొదలయ్యాయి. తెలుగుదేశం పార్టీ పాలనలో నియోజకవర్గంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని, వైసిపి నాలుగేళ్ల పాలనలో కోట్లాది రూపాయలు అభివృద్ధి పనులు చేపట్టామని, అందులో భాగంగా పలాసలో రూ.50 కోట్ల కిడ్నీ పరిశోధన కేంద్రం, 200 పడకల ఆస్పత్రి నిర్మాణం చేపట్టి ప్రారంభానికి సిద్ధంగా ఉందని పశు సంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు టిడిపికి సెల్ఫీ ఛాలెంజ్ బుధవారం విసారు. అందుకు పలాస నియోజకవర్గ టిడిపి నాయకులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష కోసంగిపురం వద్ద టిడిపి హయాంలో నిర్మించి అసంపూర్తిగా వదిలేసిన టిడ్కో కాలనీ వద్ద శుక్రవారం సెల్ఫీ తీసి వైసిపికి కౌంటర్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాజీ మంత్రి శివాజీ నాయకత్వంలో పలాసలో 2090 హుదూద్, టిడ్కో ఇళ్లను నిర్మించారని గుర్తు చేశారు. దీనిని కాదనే ధైర్యం ఎవరికైనా ఉందా? అని ప్రశ్నించారు. రంగులేసిన భవనం ఎదుట సెల్ఫీ తీసుకొని మంత్రి ఛాలెంజ్ విసరడం సిగ్గుచేటని అన్నారు. ఎన్నికలలోపు భవనం పూర్తి చేయగలరా? అని సవాల్ విసిరారు. రూ.3 కోట్ల పనులతో మొదలైన కెటి రోడ్డు నిర్మాణం మూడేళ్ల క్రితం ప్రారంభించారని అన్నారు. ఆ సమయంలో రెండు నెలల్లో పూర్తి చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చి ఇంత వరకు పూర్తి చేయలేదని

టిడ్కో కాలనీ ఇళ్ల ముందు సెల్ఫీ తీస్తున్న శిరీష

దుయ్యబట్టారు. కొండలు, గుంటలు చెరువుల కబ్జాలు తప్ప పలాసకు పనికి వచ్చేది ఏం చేశారని ప్రశ్నించారు. జాతీయ రహదారి పక్కన కోట్లాది రూపాయలు విలువ చేసే ఇళ్ల పేదల కోసం టిడిపి పాలనలో నిర్మిస్తే... దానిని పూర్తి చేయలేకపోయారని ఎద్దేవా చేశారు.

పులి సంచారంపై తప్పుడు ప్రచారం

వజ్రపుకొత్తూరు: మండలంలోని బెండిగేటు వంతెన సమీపంలో పులి సంతరిస్తుందని సోషల్ మీడియాలో గురువారం రాత్రి నుంచి వీడియో చక్కర్లు కొట్టింది. దీంతో స్థానికుల్లో భయాందోళనలు వ్యక్తమయ్యాయి. ఆ వీడియోలో ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వస్తూ విద్యుత్ వెలుగులో పులిని చూసి బైక్‌ను వెనక్కి మళ్లించినట్లు ఉంది. పులి సమీపం నుంచి ట్రావెల్ బస్సు వెళ్లడం కనిపించింది. పులి బ్రిడ్జిని ఆనించి ఉన్న ఫుట్‌పాత్ దిగువన రోడ్డుపై కూర్చొని ఉన్నట్లు కనిపిస్తుంది. దీంతో ఈ ప్రాంతంలో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ప్రస్తుతం జీడి తోటలో పిక్కలు ఏరే పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. పులి సంచారం సోషల్ మీడియా వీడియో ప్రచారంతో తోటలకు వెళ్లడానికి భయపడుతున్నారు. ఈ విషయమై కాశీబుగ్గ అటవీశాఖ రేంజర్ మురళీకృష్ణనాయుడు మాట్లాడుతూ పులి సంచారం వీడియో బెండిగేటు పరిసరాలది కాదని తెలిపారు. ఈ ప్రాంతంలో పులుల సంచారం లేదని అన్నారు. ఎలుగుల సంచారం ఉద్దానం ప్రాంతంలో అక్కడక్కడ ఉన్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియో అనంతపురం ప్రాంతానికి చెందినదిగా భావిస్తున్నామని చెప్పారు. పులి సంచారం వంటి తప్పుడు వీడియోలతో ప్రజలు ఆందోళన చెందవద్దని సూచించారు.

కూలిన చెట్టు కొమ్మ

విద్యుత్ వైర్లపై కూలిన చెట్టు కొమ్మ

వజ్రపుకొత్తూరు: మండలంలోని బెండికొండ దత్తాత్రేయ ఆశ్రమం సమీపంలో గురువారం అర్ధరాత్రి విద్యుత్ తీగలపై భారీ వృక్షం చెట్టు కొమ్మ విరిగి పడింది. రాత్రి సమయం కావడంతో ప్రమాదం తప్పిందని అంతా ఊపిరి పీల్చుకున్నారు. బెండిగేటు కూడలి నుంచి బెండి వచ్చే మార్గంలో ఏళ్ల నాటి భారీ వృక్షాలు ఉన్నాయి. రోడ్డుకి ఇరువైపులా ఏళ్ల నాటి భారీ వృక్షాలు కావడంతో కొమ్ములు పట్టు కోల్పోయి విరిగి పడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. సమీపం నుంచి వెళ్తున్న 11 కెవిపై కొమ్మలు విరిగి పడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అదే 33 కెవి వైర్లపై పడి ఉంటే పెద్ద ప్రమాదం జరిగేదని స్థానికులు తెలిపారు. రోడ్డుకి అడ్డంగా కొమ్మలు పడడంతో వజ్రపుకొత్తూరు, మంచినీళ్లపేట వైపు ట్రాఫిక్ నిలిచిపోయింది. విద్యుత్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని పనులను విద్యుత్ పునరుద్ధరించారు. రోడ్డుని ఆనించి ఉన్న కాలం తీరిన వృక్షాలను తొలగించి ప్రమాదాలు జరగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థ

డివిజన్ ఇన్‌ఛార్జీల నియామకం

శ్రీకాకుళం: ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థ (ఎపి జెఎసి అమరావతి అనుబంధం) డివిజన్ ఇన్‌ఛార్జీలను నియమించినట్లు సంస్థ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాణి రఘునాథ్, పేడాడ అమర్‌నాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం డివిజన్ ఇన్‌ఛార్జీలుగా సీపాన సింహాచలం, బొడ్డేపల్లి రవికిరణ్, పైడిపెద్ది ధనంజయ్, పలాస ఇన్‌ఛార్జీలుగా గల్లా ముకుందరావు, డి.హేమ శేఖర్, టెక్కలి డివిజన్ ఇన్‌ఛార్జీలుగా పొన్నాడ సురేష్ కుమార్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. ఉద్యోగుల శ్రేయస్సు, సమస్యల పరిష్కారం కోసం సంఘం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఇన్‌ఛార్జీలు సంఘ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మధులత

'ఓక్లాండ్' విద్యార్థుల ప్రతిభ

టెక్కలి : ఒలింపియాడ్ ప్రతిభా పరీక్షల్లో టెక్కలికి చెందిన ఓక్లాండ్ ఇంటర్నేషనల్ పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారని పాఠశాల ప్రిన్సిపాల్ మల్లా మధులత తెలిపారు. ఈ మేరకు విజేతలకు శుక్రవారం అభినందనలు తెలిపారు. పాఠశాలకు చెందిన జోషిత్ శ్రీనివాస్, మద్ది జైచరణ్, హర్షవర్ధన్, వెన్నెలలు ప్రతిభ కనబరిచిన వారిలో ఉన్నారని అన్నారు. పోటీ ప్రపంచాన్ని తట్టుకునే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బంగారు పతకాలతో పాటు, ధ్రువీకరణ పత్రాలను అందించారు.

రేపు జాబ్‌మేళా

ఇచ్ఛాపురం : ఈ నెల 23 ఉదయం 10 గంటలకు సత్య సాయి స్కూల్‌లో రక్ష సెక్యూరిటీ ఆధ్వర్యాన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు స్కూల్ చైర్మన్ భాను తేజ, సంస్థ మేనేజర్ హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువతకు జిఎంఆర్ రక్ష సెక్యూరిటీలో సెక్యూరిటీ గార్డుల ఎంపికకు ఈ మేళాను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పదో చదువుకున్న నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎత్తు 166 సెంటీమీటర్లు ఉండాలని, 18 నుంచి 35 ఏళ్లలో వారు అర్హులని అన్నారు. తమ ఒరిజినల్ ధ్రువ పత్రాలతో పాటు పోలీస్ వెరిఫికేషన్ ధ్రువపత్రాలు, కోవిడ్ వాక్సిన్ వేసుకున్నట్లు ధ్రువపత్రాల జిరాక్స్‌లు ఫొటోలతో హాజరుకావాలని సూచించారు.

కుట్టుమిషన్ల పంపిణీ

పలాస : మహిళలు స్వయం ఉపాధితో ముందుకు సాగి ఆర్థికాభివృద్ధి సాధించాలని హెల్పింగ్ హాండ్స్ డైరెక్టర్, చిన్నబడాం క్రిస్టియన్ ప్రేయర్ టెంపుల్ బిషఫ్ డిఎస్‌విఎస్ కుమార్ అన్నారు. చిన్నబడాం క్రిస్టియన్ ప్రేయర్ టెంపుల్‌లో ఉచిత కుట్టు మిషన్లను శుక్రవారం మహిళలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎనిమిది నెలలుగా మహిళలకు కుట్టుపై శిక్షణ ఇచ్చి తద్వారా మిషన్లను పంపిణీ చేశామని అన్నారు. మహిళలు మార్గదర్శకంగా నిలబడాలని ఉద్దేశంతోనే కుట్టు మిషన్లపై శిక్షణనిస్తున్నామని తెలిపారు. ప్రశాంత్‌కుమార్, మహిళా సమాజం అధ్యక్షులు ఈవెన్ గ్లోరీ జీవరత్నం, పాస్టర సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

కుట్టు మిషన్లతో మహిళలు, కుమార్

జీడికి మద్దతు ధర రూ.16 వేలు ప్రకటించాలి

పోస్టర్లను పంపిణీ చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- పలాస

జీడి రైతులు పండించే జీడి పిక్కల బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న కాశీబుగ్గ లాస్య ఫంక్షన్ హాలులో సదస్సు నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని జీడి రైతుల సంఘం నాయకులు తెప్పల అజయ్‌కుమార్, కుత్తుం వినోద్ డిమాండ్ చేశారు. ఉద్దానంలోని ఐదు పంచాయతీలైన మామిడిపల్లి, బొడ్డపాడు, మాకన్నపల్లి, నీలావతి, గురుదాసుపురం, రంగోయి, మామిడిమెట్టు, గిరిజన గ్రామాలైన లొత్తూరు, హల్దిగాం, చిన్నపలియా, పెద్దపలియా, తుసరాడ, జెన్నాసాయి, గంతారు గ్రామాల్లో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్నేళ్లుగా ప్రభుత్వం జీడి ధరపై స్పష్టమైన నిర్ణయం తీసుకోకుండా రైతులకు దగా చేస్తుందన్నారు. ఈ సదస్సు ద్వారా రైతులు ఐక్యమై మద్దతు ధర సాధన కోసం కదలి రావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆయా గ్రామాల్లో పోస్టర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బత్తిన వీరాస్వామి, తెప్పలరాజు, జుత్తు లోకనాథం, ఎస్.కుమార్, ఎస్.పాపారావు, ఎస్.లోక్నో, ఎస్.సురంగిలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం

కవిటి: ఇచ్ఛాపురం నియోజకవర్గం టిడిపికి కంచుకోటని, కచ్చితంగా గెలుపు తమదేనన్న ధీమా, అలసత్వం దరిచేరనీయకుండా నిరంతరం ప్రజాక్షేత్రంలో ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నియోజవర్గంలోని నాలుగు మండలాల యూనిట్, బూత్ లెవల్, ఇచ్ఛాపురం మున్సిపాల్టీ క్లస్టర్ ఇన్‌ఛార్జీలతో స్థానిక లోళ్ల నారాయణమూర్తి కళ్యాణ మండపంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ టిడిపి చేపడుతున్న ఇదేం కర్మ రాష్ట్రానికి, బాదుడే బాదుడు కార్యక్రమాలు పూర్తిస్థాయిలో నిర్వహించాలని సూచించారు. బూత్ లెవెల్ నుంచి ప్రతి కార్యకర్తా అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజా

మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

వ్యతిరేక నిర్ణయాలు, నిత్యవసర వస్తువుల ధరల పెరుగుదల ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గం పరిశీలకుడు కోళ్ల అప్పలనాయుడు, టిడిపి నాయకులు మణిచంద్రప్రకాష్, సదానంద రౌలో, పొందల కృష్ణారావు, సీపాన వెంకటరమణ, బెందాలం రమేష్, కాల ధర్మారావు, నందిక జానీ, ఆర్.జాణకిరావు, డి.ఢిల్లీరావు, టి.సూర్యనారాయణ, రామారావు, సాలిన ఢిల్లీ పాల్గొన్నారు.

చలివేంద్రాలు ప్రారంభం

ఇచ్ఛాపురం : ప్రారంభిస్తున్న రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

శ్రీ స్వేచ్ఛావతి అమ్మవారి సంబరాలు దృష్ట్యా వేసవి కాలంలో ప్రజలు దాహార్తిని తీర్చడానికి ఇచ్ఛాపురం పురపాలక సంఘం పరిధిలో కమిషనర్ రమేష్ అధ్యక్షతన మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ భారతి దివ్య శుక్రవారం చలివేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలకు మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశారు. వేసవి ఎండలు, సంబరాలకు వచ్చే యాత్రికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి నారాయణరావు, ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర, ఇన్‌ఛార్జి ఎఇ పృథ్వీ, సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం ఉప్పలవీధిలో యువసూర్య ఛారిటబుల్ ట్రస్టు చర్మన్, న్యాయవాది రాంబాబు శ్రీ స్వేచ్ఛావతి అమ్మవారి సంబరాల మహోత్సవం సందర్భంగా చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రకాశరావు పట్నాయక్, సుగ్గు ప్రేమ్‌కుమార్, బర్ల లక్ష్మణరావు, నందికి సోమేష్, పాక దాసు, నీలాద్రి పాల్గొన్నారు.

కవిటి: కవిటి మండలం శిలగాంలో ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, సర్పంచ్ కడియాల హేమలత చలివేంద్రం ప్రారంభించారు. అనంతరం పాదచారులకు మజ్జిక పంపిణీ చేశారు. కార్యక్రమంలో కడియాల బాబూరావు, కార్యదర్శి ఎన్.మన్మథరావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అమ్మన్నాయుడు

మేడేను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- పొందూరు

మే 1న ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు పిలుపునిచ్చారు. సిఐటియు మండల మహాసభ శుక్రవారం పొందూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలు అవలంబిస్తూ కార్మిక, కర్షకులకు ద్రోహం చేస్తుందని విమర్శించారు. కార్మిక హక్కులు కాలరాస్తూ పెట్టుబడిదారులకు కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చేవిధంగా కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు తెచ్చిందని అన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు, కనీస పెన్షన్ రూ.పది వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు గ్రాట్యుటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, పెన్షన్ సదుపాయం కల్పించాలన్నారు. అంగన్వాడీ సెంటర్లు ఉదయం 12 గంటలు వరకు ఒంటిపూట నిర్వహిస్తూ కార్యకర్తలను మధ్యాహ్నం మూడు గంటల వరకు ఉండమని అధికారులు చెప్పడం సరైనది కాదన్నారు. అంగన్వాడీలకు వేసవి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విఆర్‌ఎలకు రికవరీ చేసిన డిఎను తిరిగి చెల్లించాలన్నారు. పార్లమెంటులో తన మంద బలంతో ఆమోదింపచేసుకున్న కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్య, వైద్య రంగాలకు నిధులు పెంచాలన్నారు. ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్లో రూ.2 లక్షల కోట్లకు పెంచాలన్నారు. ప్రజా పంపిణీకి నిధులు కేటాయించి 14 రకాల సరుకులు సబ్సిడీ ధరలతో అందించాలన్నారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు.

మండల కమిటీ ఎన్నిక

వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు అమ్మన్నాయుడు ఆధ్వర్యాన సిఐటియు నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. సిఐటియు మండల కన్వీనర్‌గా పి.అప్పలనాయుడు, కో-కన్వీనర్లు, కమిటీ సభ్యులుగా ఎస్.రమణమ్మ, రమాదేవి టి.త్రినాథరావు, అనకాపల్లి రాధాకృష్ణ, బి.లక్ష్మీనారాయణ, మణిలను ఎన్నుకున్నారు.

ప్రయివేట్‌కు ధీటుగా ప్రభుత్వ విద్య

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ప్రయివేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అందుబాటులోకి తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే చెందుతుందని జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ ప్రతినిధి పాలిన శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గోవిందపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోరకల శరత్ అధ్యక్షతన శుక్రవారం పాఠశాల వార్షికోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 74 ఏళ్ల పాఠశాల చరిత్రలో ఇటువంటి కార్యక్రమం ఎన్నడూ జరగలేదని, దీన్ని ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ బృందానికి అభినందనలు తెలిపారు. పాఠశాలలో మౌలిక వసతులు కల్పనకు, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం అనేక విధాలుగా సహకరిస్తుందని అన్నారు. హెచ్‌ఎం శరత్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పైనా వ్యక్తిగత శ్రద్ధ తీసుకుంటూ చదువుతోపాటు వ్యక్తిత్వ వికాసానికి ఇప్పటి నుంచే బలమైన పునాదులు వేస్తున్నామని అన్నారు. విద్యార్థులను నవోదయ వంటి పోటీ పరీక్షలకు సన్నద్ధం చేయడంతో పాటు వారిలో సృజనాత్మక శక్తిని వెలికి తీసే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. అనంతరం పాఠశాల ఆవరణలో సరస్వతి దేవి, వివేకానంద, గాంధీజీ విగ్రహాల ఏర్పాటు చేసిన దాతలు దున్న రాజేశ్వరి,

మాట్లాడుతున్న శ్రీనివాసరావు

తంగుడు ఉమాకామేశ్వరరావులను పాఠశాల కమిటీ ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ప్రతినిధి పాలిన ఉమామహేశ్వరరావు, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షులు పాలిన తేజాశోభన్, ఉపాధ్యాయులు ఆశాజ్యోతి, మహేష్, యువతరం సేవా సమితి అధ్యక్షులు చింత మురళి పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- టెక్కలి

మండలంలోని ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని యుటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు డి.లక్ష్మీనారాయణ, పొట్నూరు జగదీష్‌లు కోరారు. ఈ మేరకు ఎంఇఒ డి.నాగభూషణంను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఉపాధ్యాయులు పలు సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. మెడికల్ రీయంబర్స్‌మెంట్ బిల్లులు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు డి,లక్ష్మీనారాయణ, జగదీశ్వరరావు, కురమాన దాలయ్య, డి.వైకుంఠరావు, తమ్మినేని వైకుంఠరావు, ఆర్.రమేష్‌కుమార్, ఎం.కుమారస్వామి, రోణంకి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిలదీత

ప్రజాశక్తి- మెళియాపుట్టి

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి రానా ఈశ్వరమ్మ అధ్యక్షతన శుక్రవారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు సభ్యులు ప్రజా సమస్యలపై నిలదీశారు. గొడ్డ పాఠశాలకు విద్యుత్ లైను తీసివేశారని, దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని కేరాసింగి సర్పంచ్ ప్రతినిధి అప్పారావు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. గోకర్ణపురం క్షేత్ర సహాయకులు పనితీరు బాగులేదని, ఆయనకు విధుల నుంచి తప్పించాలని, అలాగే కరజాడలో ఎండిఎం బాగులేదని సభ్యులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. మెళియాపుట్టిలో ఏడాది కింద చేపట్టిన ఉపాధి పనులకు ఇప్పటి వరకు బిల్లులు చెల్లించలేదని ఎంపిటిసి ప్రతినిధి జైమునిరావు ఆవేదన వ్యక్తం చేశారు. జాడుపల్లి ప్రాథమిక పాఠశాల ఎండిఎం కార్మికురాలి చీరకు నిప్పంటుకొని మృతి చెందిందని, ఆమె కుటుంబ సభ్యులను ఆదుకోవాలని ఎంపిటిసి ప్రతినిధి

మాట్లాడుతున్న ఎంపిపి ఈశ్వరమ్మ

కె.పైడిరాజు సభ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, వైస్ ఎంపిపి ఎస్.ఆదినాయుడు, ఎంపిపి ప్రతినిధి ఉదయ్ కుమార్, తహశీల్దార్ పి.సరోజని, ఎంపిడిఒ పి.చంద్రకుమారి, ఎంఇఒ ఎస్.వేవేందరరావు, ఎపిఒ టి.రవి, ఎపిఎం లలిత తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ సేవలు విస్తృతం

ప్రజాశక్తి- టెక్కలి

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ పోస్టల్ సేవలు విస్తృతం చేయాలని విశాఖ రీజనల్ పోస్ట్‌మాస్టర్ జనరల్ వి.రాములు అన్నారు. స్థానిక పోస్టాఫీసులో టెక్కలి, సోంపేట సబ్‌డివిజన్ పరిధిలోని జిడిఎస్, బిపిఎం, సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో తపాలాశాఖ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. శాఖ ద్వారా అందిస్తున్న సేవలతో పాటు బీమా రంగంలోని తీసుకున్న మార్పులు, మహిళలకు, పిల్లలకు చేపడుతున్న సేవలను విస్తరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సూపరింటెండెంట్ వి.సత్యనారాయణ, ఎ.ఎస్.పి.ఇంద్రసేన, పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.శ్రీకాంత్, పోస్టుమాస్టర్ భానోజీరావు పాల్గొన్నారు.

విత్తన కిట్లను పంపిణీ చేస్తున్న స్పీకర్ సీతారాం

నవధాన్యాల విత్తన కిట్లు పంపిణీ

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని జి.కె.వలసలో రైతులకు నవధాన్యాల విత్తనాల కిట్లను శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం శుక్రవారం పంపిణీ చేశారు. గడపగడపకి మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా స్పీకర్ గ్రామానికి విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులందరూ ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టి నేలను సారవంతం చేసి అధిక దిగుబడులను సాధించాలన్నారు. రసాయన రహిత పంటలను పండించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రాజెక్టు మేనేజర్ రేవతి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్యామలరావు

రైతుల అభ్యున్నతికి కృషి

ప్రజాశక్తి- జలుమూరు

రైతుల అభ్యున్నతికి కృషి చేస్తానని అల్లాడ పిఎసిఎస్ అధ్యక్షుడు మొజ్జాడ శ్యామలరావు అన్నారు. అల్లాడ పిఎసిఎస్ అధ్యక్షులుగా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిఎసిఎస్ అధ్యక్షునిగా రైతుల అభ్యున్నతికి కృషి చేస్తానని అన్నారు. మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు పొన్నాన ముసలినాయుడు, త్రిసభ్య కమిటీ సభ్యుడు మొజ్జాడ భాస్కరరావులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు ముసలినాయుడు తాను పనిచేసిన కాలంలో అన్ని విధాలుగా సహాయపడిన పిఎసిఎస్ సిఇఒ పి.గిరిధర్‌రావు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నూతన త్రిసభ్య కమిటీ సభ్యుడు అల్లు దాలప్పన్న, పిఎసిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటిని సరఫరా చేయాలని వినతి

ఇచ్ఛాపురం : మున్సిపాల్టీ పరిధిలోని 20వ వార్డు కొండపోలామ్మ కాలనీకి ట్యాంకర్ ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని వైసిపి జిల్లా ప్రచార కమిటీ చైర్మన్, వార్డు కౌన్సిల్ తాడి ఆదిరెడ్డి కోరారు. ఈ మేరకు కమిషనర్ రమేష్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కాలనీలో తాగునీటి సౌకర్యం లేదని, వేసవి కాలం కావడంతో తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేసి వీధి వాసుల కష్టాలను తీర్చాలని కోరారు.

వినతిపత్రం అందజేస్తున్న ఆదిరెడ్డి

బూర్జ : ర్యాలీలో మాట్లాడుతున్న రవికుమార్

మందస : ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

మెళియాపుట్టి : గ్రామస్తులతో మాట్లాడుతున్న సాగర్

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి- బూర్జ

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యమని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ విమర్శించారు. మండలంలోని కాళపర్తిలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ మేరకు గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి శంకుస్థాపన పైనా జగనన్న అని పేరు తప్ప అభివృద్ధి సున్నాని అన్నారు. ప్రజలకు పథకాలు పేరు చెప్పి ఈ రాష్ట్రాన్ని దూసుకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు బి.రాంజీనాయుడు. లంక జగన్నాథంనాయుడు, పిల్ల కన్నంనాయుడు, హనుమంతి గోవిందరావు, భద్రాద్రి రామ్మూర్తినాయుడు, కె.కృష్ణ, గణపతిరావు పాల్గొన్నారు.

మందస : ప్రభుత్వం టిడిపి నాయకులను లక్ష్యం చేస్తూ... వారిపై కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తుందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. మందస మండలం హంసరాల పంచాయతీ కొయిటాసాయి, టొబ్బురు, మంధూరు గిరిజన గ్రామాల్లో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. గిరిజనులను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. గిరిజనులకు కేటాయించిన నిధులను సైతం ప్రభుత్వం వాడుకుంటుందని విమర్శించారు. జిల్లాలో ఉన్న ఐటిడిఎ పక్క జిల్లాకు వెళ్లిపోవడంతో గిరిజనులు తమ సమస్యలను చెప్పుకునేందుకు అవకాశం లేకుండా పోయిందన్నారు. టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, టిడిపి అధ్యక్షుడు బావన దుర్యోధన, ప్రధాన కార్యదర్శి లబ్బ రుద్రయ్య, రట్టి లింగరాజు, డొంకూరు తిరుపతి, భాస్కరరావు, లచ్చయ్య, నవీన్ పాల్గొన్నారు.

మెళియాపుట్టి మండలంలోని పడ్డ, సానిపాలెం గ్రామల్లో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్ రాష్ట్రానికి ఇదేం కర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలతో ముద్రించిన పోస్టర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు భాస్కర్‌గౌడ్, మహిళా జిల్లా ఉపాధ్యక్షులు బి.లలితకుమారి, మండల ప్రధాన కార్యదర్శి ఉర్లన వసంత్, సర్పంచ్ ప్రతినిధులు మాలతి శ్రీధర్, రవ్వల గణపతి, పరమేష్‌రెడ్డి, ఒట్టి కోల చక్రి, పడాల శ్రీను, ఎల్లంనాయుడు, రామ్మోహన్, పాపారావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: ఎప్పుడు ఎన్నికలు వచ్చినా టిడిపి గెలుస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షులు బోయిన రమేష్ అన్నారు. మండలంలోని దంత పంచాయతీలో శుక్రవారం ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ పోస్టర్లను అందజేశారు. ఈ నాలుగేళ్లలో నిత్యావసర సరుకుల నుంచి గ్యాస్, విద్యుత్, బస్సు ఛార్జీలు అధికంగా పెరిగిపోతున్నాయని అన్నారు. కార్యక్రమంలో హరిశ్చంద్రపురం మాజీ సర్పంచ్, పూజారి శైలజ, మాజీ ఎంపిపి తర్ర రామకృష్ణ, వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు, పూజారి శైలజ, దేవాది సింహాద్రమ్మ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

కవిటి: పంచాయతీలో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు డి.జి.పుట్టుగ సర్పంచ్ బెందాలం కిరణకుమారి తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.3 లక్షలతో గ్రామంలో సిమెంట్ రహదారి నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీలో పూర్తిస్థాయిలో రహదారుల నిర్మాణం చేపడుతున్నామని అన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే వేసవి తీవ్రత దృష్ట్యా పంచాయతీలో నీటి కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బెందాలం జయప్రకాష్, చందాన పూర్ణ చంద్రుడు, బదకల భాస్కరరావు పాల్గొన్నారు.

పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ కిరణకుమారి

అంజలి రథంపై అమ్మవారి తిరువీధి

అమ్మవారిని ఊరేగిస్తున్న కమిటీ సభ్యులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణంలోని శ్రీస్వేచ్ఛావతి సంబరాలు ఐదో రోజూ ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శుక్రవారం అంజలి రథంపై అమ్మవారిని బెల్లుపడా, కంశాల వీధి, బొద్దు, గౌరిసి, గుజ్జు, దల్లివీధి, రెయ్యి, బూడుపు, చిన్నబజారు మండపం, చంద్రయమ్మ, దర్శనం, త్రినాథ్‌పేట వీధుల్లో తిరువీధి నిర్వహించారు. తిరువీధితో పాటు ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరికీ ఆకట్టుకున్నాయి. అంజలి రథాన్ని కార్పెంటర్లు మేకలు లేకుండా ప్రత్యేకంగా తయారీ చేశారు. సిఐ ఈశ్వర్ చంద్ర ప్రసాద్ ఆధ్వర్యాన టౌన్ ఎస్ఐ గోవిందరావు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేడు వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి- పలాస

మండలం బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరం వద్ద శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న సిపిఐ ఎం.ఎల్ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ సీనియర్ నాయకులు మద్దిల మల్లేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. దేశంలో పార్టీ ఏర్పడి 54 ఏళ్లు పూర్తి చేసుకుందని, ప్రజా సమస్యలపై పల్లె పల్లెకు విస్తరించిందని అన్నారు. ప్రధానిమంత్రి నరేంద్ర మోడీ మతతత్వ ఫాసిజంకు వ్యతిరేకించడంలో పార్టీ ముందు వరుసలో ఉందని పేర్కొన్నారు. సమావేశంలో కుత్తుం దుశ్యంత్, పి.అప్పారావు, శ్రీను, పి.కామేశ్వరరావు, యుగంధర్, బైనపల్లి చంద్రరావులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మల్లేశ్వరరావు

శివాజీ పరామర్శ

ప్రజాశక్తి- పలాస

మాజీ ఎంపీ కణితి విశ్వనాథం ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి గౌతు శ్యాంసుందర శివాజీ గురువారం విశ్వనాథం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ నీతి, నిజాయితీతో రాజకీయాలు చేసిన వ్యక్తి విశ్వనాథం అని కొనియాడారు. ఎంతో మందికి రాజకీయ భవిష్యత్‌ను కల్పించాలన్నారు. విశ్వనాథంతో కలిసి పని చేసిన సందర్భాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయనతో పాటు టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, బడ్డ నాగరాజు, గాలి కృష్ణారావు, పైల చక్రధర్ పాల్గొన్నారు.

వరి విత్తనాలను సిద్ధం చేయాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రానున్న ఖరీఫ్ సీజన్‌కు రైతులకు కావాల్సిన వరి విత్తనాలు సిద్ధం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపిపి ప్రతినిధి కె.మోహనరావు, జెడ్‌పిటిసి ప్రతినిధి ఉప్పాడ రాజారెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాయంలో వ్యవసాయ అధికారిని శ్రీదేవి అధ్యక్షతన మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయానికి సంబంధించి వచ్చే ఖరీఫ్‌కి అవసరమైన విత్తనాలను గ్రామాల్లో గుర్తించాలన్నారు. సమావేశంలో రెడ్డికి కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరావు, వ్యవసాయ సలహా మండలి సభ్యులు పాల్గొన్నారు.

రేపు సొండిల సమావేశం

మందస : మండలంలోని హరిపురం బజారులో వీధిలో ఉన్న హైస్కూల్‌లో ఈ నెల 23న మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నారని సొండీల సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు రత్నాల కాశీశ్వనాథ్ చౌదరి, ప్రధాన కార్యదర్శి బెహరా రాజారావులు ఒక ప్రకటనలో తెలిపారు. ఒబిసి సాధనకు, సొండిల సమస్యలపై చర్చిస్తామని అన్నారు. ఈ సమావేశానికి సొండిల సంక్షేమ సంఘం కోశాధికారి శ్రీనివాసరావు పాల్గొంటారని తెలిపారు. మండలంలోని సొండిలందరూ పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు స్పీకర్ పర్యటన

పొందూరు: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం పర్యటించనున్నట్లు వైసిపి మండల అధ్యక్షుడు పప్పుల రమేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక జెవిఆర్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు ఆమదాలవలస మండలం ఇసకలపేట వద్ద ఉన్న బలసలరేవు వంతెన నిర్మాణ శంకుస్థాపనపై సర్పంచ్‌లతో, ఎంపిటిసిలతో, గృహ సారథులతో, సచివాలయ కన్వీనర్లతో, వార్డు మెంబర్లతో సమావేశం నిర్వహిస్తారని అన్నారు. అలాగే మధ్యాహ్నం 3 గంటలకు బొడ్డేపల్లిలో జల జీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింట కుళాయి ఏర్పాటుకు, మొదలవలసలో ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని అన్నారు. అనంతరం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి మల్లేశ్వరమ్మ

కనిమెట్టలో 'ఫ్యామిలీ ఫిజీషియన్'

పొందూరు: మండలంలో కనిమెట్టలో కింతలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యాన శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మల్లేశ్వరమ్మ గ్రామానికి చెందిన గర్భిణులకు, బాలింతలకు, వృద్ధులకు, మంచం పట్టిన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. పిహెచ్‌ఎన్ సూర్యకుమారి, ఎంఎల్ హెచ్‌పి సుభాషిని, ఎఎన్ఎం లీలాకుమారి, హెల్త్ అసిస్టెంట్ ధనారావు పాల్గొన్నారు.

కేక్‌ను కట్ చేస్తున్న నేతాజీ

నేతాజీ పుట్టినరోజు వేడుకలు

కవిటి: వైస్ ఎంపిపి పూడి నేతాజీ జన్మదిన వేడుకలు మండలంలోని జగతిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త పిరియా సాయిరాజ్ పాల్గొని మాట్లాడారు. చెదరని చిరునవ్వు, ఆత్మీయ పలకరింపు నేతాజీని ప్రజల మనిషిని చేశాయని కొనియాడారు. అనంతరం నేతాజీ కేక్‌ను కట్ చేసి సాయిరాజ్, ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్‌లకు తినిపించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి కరి గోపయ్య, పిఎసిఎస్ అధ్యక్షుడు దేవరాజ్‌సాహూ, సర్పంచ్‌లు పూడి ప్రసాదరావు, ఎస్.పి.నారాయణస్వామి, ఎంపిటిసిలు పూడి నీలాచలం, దుద్ది సతీష్ పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా అందజేత

మెళియాపుట్టి : మండలంలోని పెద్దపద్మాపురానికి చెందిన పి.కాంతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. మృతురాలు వైఎస్ఆర్ బీమాకు అర్హులు కావడంతో కుటుంబ సభ్యులకు సర్పంచ్ మాలతి జయలక్ష్మి తక్షణ ఆర్థిక సాయం కింద రూ.పది వేలు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో లింగాల సంజీవరావు, బైపోతు తేజారావు, కార్యదర్శి అప్పారావు, పుణ్యవతి పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న సర్పంచ్ జయలక్ష్మి